కథానిక:

# "జీవితసారం"

శ్రీ యర్రమిల్లి చలపతిరావు

గోడనున్న గడియారం పన్నెండు కొట్టింది. ఆ హాల్లో నిశ్శబ్దం, ప్రశాంతత, తప్పమరేవీ అలికిడిలేదు. గోడనున్న గడియారం టకటక కొట్టుకుంటూనే వుంది, కాలచక్రానికి అడ్డు లేదన్నట్లు. ప్రపంచం అంతా నిద్రాదేవత ఒడిలో గాఢసుషుప్తిలో మునిగివుంది. జానకి మాత్రం ఆసమయంలో మేలుకొనే వుంది. ఆమెకు నిద్దరపట్టలేదు. పిల్లలంతా, గాఢనిద్రలో మైమరచి, ఈ ప్రపంచాన్నే మరచారు.

జానకి మాత్రం, అలాగే కుర్చీలో కూర్చుని కిటికీలోంచి అవతలికి చూస్తోంది. రోడ్డుమీద విద్యుద్దీపాలు తోరణాల్లా ప్రకాశిస్తున్నాయి. జనసంచారం చాలవరకు తగ్గింది. పగలంతా కార్లతో, బళ్లతో, అనేక రకాల జనసమూహంతో, కిటకిటలాడుతూ, సమ్మర్దనంగా వుండేరోడ్డు, ప్రశాంతంగా, నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా వుంది... జానకి ఆలోచిస్తూంది. ఆయన ఇంకా రాలేదు. పన్నెండు కొట్టి అప్పుడే పదినిముషాలైంది. రైలుగానీ ఇవ్వాళ లేటయింకేమో! ఆమె ఒక్క వేడి నిట్టూర్పు భారంగా విడిచింది. ఆసమయంలో, ప్రపంచం అంతా నిద్రాసమాధిలో మునిగివున్న తరుణంలో, తనొక్కర్తే మేలుకొంది. తనకేవో భావాలు అప్రయత్నంగా కలుగుతున్నాయి. దేన్నిగురించి అయినా ఆలోచించడానికి అంతకంటె తరుణం, అవకాశం, మరి లభించదేమో! దేన్నిగురించి అయినా ఆలోచిద్దామనికాని, అలా ఆలోచించడానికి తగిన అవకాశం లభిస్తుందనికాని, అలాంటె అవకాశం లభించినా ఆలోచించడానికి తగిన సంస్కారం తనకుంటుందనికాని, ఆమె ఎన్నాడూ అనుకోలేదు. ఆయన క్యాంపుకెళ్లి వారంరోజులైంది. ఈ వారంరోజుల్నుంచీ, తనకి దేనిగురించి ఆలోచించాలన్న ఉద్దేశమే కలుగలేదు. అలా ఆలోచించడానికి అవకాశమూ దొరకలేదు. ప్రొద్దున్నే లేవడం, కాఫీ పెట్టుకుని, వంటఇంట్లో ప్రవేశిస్తే, తిరిగి పన్నెండు గంటలకే, ఇవతలికి రావడానికి వీలయేది. అనంతరం కొంగుపరుచుకుని, ఏ మూలన్నో కొంత నడుంవాలిస్తే, కొంత అలసటతీరి, విశ్రాంతి తీసుకుని, మెలకువచ్చే సరికల్లా మూడయేది. మూడు గంటలనుంచీ తిరిగీ వంటింట్లో ప్రవేశిస్తే, రాత్రి పన్నెండుగంటలయేసరికి మాత్రమే ఇవతలకొచ్చేది. తరువాత, పిల్లల్ని నిద్రపుచ్చడం, తను కూడా అలసటతో నిద్రాదేవి ఒడిలో వ్రాలిపోవడం, యిలాగే, ఈ వారంరోజులు గడచాయి – ఈ రాత్రిబండికే వస్తానన్నారు. ఇంకా రాలేదేం చెప్మా? జానకి మళ్లీ గడియారంవయిపు చూచింది. చిన్న ముల్లు ఒంటిగంటమీద వుంది. బండి తప్పకుండా లేటయే ఉంటుంది. ఏ క్షణంలో వచ్చి తలుపు కొడతారో? ఆమె అలానే నిరీక్షించసాగింది – నిద్రకూడా ఎంత ప్రయత్నించినా, పట్టలేదు. ఆ అర్థరాత్రి స్తబ్ధప్రకృతిలో, ఆమెకు అలా మేలుకొనిఉంటేనే ఆత్మ ప్రశాంతంగా, వుంది. దైనం దిన జీవితకార్యక్రమంలో, తన పాత్ర, ఎంత కష్టతరమయినది? ఎంత విశ్రాంతి లేనిది! ఎంత వేదనాకరమైనది! తన పెళ్లయి పదేళ్లయింది. తను, పసిమి యౌవనంలో, మిస

(28-వ పేజీచూడండి)



## "జీవితసారం"

(16 వ-పేజీ తరువాయి)

మిసలాడుతూ, యౌవనపు తొలిపొంగులో ఉన్నప్పుడు, తను, తన సంసారజీవితం గురించి ఎన్ని కలలు కనేది. గృహమే స్వర్గమనీ, సంసారమే జీవితసారమనీ, అనుకూలుడైన భర్తతోడి జీవితమే జన్మసాఫల్యమనీ, భావించింది. ప్రేమను గురించీ, పెళ్ళిని గురించీ, సంసారసుఖాన్ని గురించీ. ఎన్నో నవలలు చదివింది. తను చదివిన ప్రతి పుస్తకం, సంసార సౌఖ్యమే. జీవిత సారమనీ, ఆదర్శదాంపత్యమే, జన్మసాఫల్యమనీ, బోధించింది. భవిష్యత్తులోని భర్తతోడి, తన సంసారసుఖాన్ని ఊహించుకుని. ఆమె పగటికలలు కంది. అనుకున్నట్లుగానే అన్నివిధాలా అనుకూలుడైన భర్త లభించాడు. హృదయంలో ఉప్పొంగే కోరికలతో, నవనవోత్సాహంతో, యౌవనపు తొలిపొంగులోని, తీయని తలపులతో, భర్తవెంట కాపురానికి వెళ్లింది. ఆనాడే, తను, చిన్నప్పట్నుంచీ, కలిసిమెలసిన స్నేహితురాళ్లనీ, ఆడిపాడిన స్థలాల్నీ, తల్లి తండ్రుల్నీ, జన్మభూమినీ, సర్వస్వాన్నీ విడిచిపెట్టింది. అనంతరం తనకు భర్తే సర్వస్వం అయాడు. తనొక క్రొత్తజీవితం ప్రారంభించింది. అంతకుముందు తన కెన్నో ఆశయాలూ, ఆదర్శాలూ, భావాలూ ఉండేవి. చదువుకొనేటప్పుడు జీవితం గురించీ, సంసారంలో, స్త్రీయొక్క గురుతరబాధ్యత గురించీ, జీవించడం యెందుకు? అనే సమస్యమీదా స్నేహితురాళ్లతో చర్చించేది. వాదించేది కూడా. అన్ని విధాలా అనుకూలుడైన భర్తతోడి సంసారసౌఖ్యమే జీవితసారమనీ, ఆదర్శదాంపత్యమే, గృహిణి జీవితాదర్శమనీ, స్త్రీగా జన్మించడం, మాతృత్వాన్ని సార్థకం చేసుకొనడానికేననీ, తన అభిప్రాయం. తన ఆదర్శాలన్నిటినీ, స్నేహితురాళ్లందరికీ, చెప్పి, తృప్తిపడేది. సంసారంలో ఎంతో అమరసుఖం వుంటుందనీ, ఆదర్శగృహిణిగా తన జీవితం ఎంతో కాంతివంతంగా ఉంటుందనీ మురిసింది. ఆ ఆదర్శాలతోనే సంసారంలో అడుగుపెట్టింది. పెళ్ళయి పదేళ్ళయింది. పదేళ్ళ తన సంసారజీవితం యొక్క ఫలితంగా, నలుగురుపిల్లలు. మొదట్లో రెండుమూడు సంవత్సరాలు, భర్తతో తన జీవితం కాస్తచెప్పుకోదగ్గదిగా వుంది. అది కూడా ఎలా గడిచిపోయిందో ఆ రోజుల్లో తనెంతగా సుఖించిందో, తన కిప్పు డేమీ జ్ఞాపకంలేదు. రామూ పుట్టిన తరువాత సంసారంలో తనయొక్క పాత్ర ఏమిటో అర్థమైంది. తరువాత సంవత్సరానికీ, కమల పుట్టింది—కమల పుట్టిన తరువాత, మాతృత్వం అంటే ఏమిటో తనకు పూర్తిగా అర్థమైంది. కమల తరువాత, రాధా, రాధ తరువాత, రఘూ పుట్టి నలుగురు పిల్లలతల్లి అయింది. సంసారం అంటే యేమిటో తనకు పూర్తిగా ఇప్పుడే అర్థమైంది - పదేళ్ళయి తను కాపురానికి వచ్చింది. తను ఊహించిన, ఆ జీవితసారం అంటే ఏమిటో ప్రపంచంలో, మానవుల జీవితలక్ష్యం ఏమిటో, అందరూ ఎందుకోసమని పెళ్లిళ్లుచేసుకుని ఎందుకోసమని సంసారాలు చేస్తూ జీవిస్తున్నారో తనకి అర్థమయిందిగాదు. నిజంగా సంసారంలో ముఖ్యంగా, స్త్రీకి నిజమైన ఆనందం శాంతీ, లభిస్తాయా? జీవితంయొక్క లక్ష్యమేమిటి? ఒక్కొక్కప్పుడు తను ఎందుకోసం జీవిస్తున్నాను? అని తనే ప్రశ్నించుకుంటూ ఉంటుంది. ఆలోచించగా, ఆలోచించగా తనకి ఈ సమాధానాలు మాత్రమే దొరుకుతాయి. వేళకి అన్నంవండి భర్తకు పెట్టడం. ఇంటి పను లన్నీ చక్కబెట్టుకోవడం! పిల్లల్ని సముదాయించడం ఉగ్గుపట్టవలసిన పసిపిల్లకు ఉగ్గూ, అన్నంపెట్టవలసిన పిల్లలకు అన్నాలూ పెట్టి అన్ని విధాలా పిల్లల సంరక్షణ చేయడం, రాత్రి మళ్ళీ వంటా భోజనాలూ అనంతరం శయ్యాగృహంలో 'శయనేషురంభా' అన్న సూక్తిని సార్థకం చెయ్యడం! వీటికోసమే, తను జీవిస్తోంది. జీవిత సారం అంటే ఇదేనా? పదేళ్ళ సంసారజీవితంలో తను చెప్పుకోదగ్గ సుఖం ఏం అనుభవించింది? తన ఆశయాలూ, ఆదర్శాలూ


# ప్రమాదరక్షణకు ప్రశస్తమైనది భీమా

ఎప్పుడేప్రమాదం వచ్చేదీ, ఏక్షణం ఎలా ఉండేదీ తెలియని ఈదినాల్లో

అగ్ని * మోటార్ కారు * కార్మిక నష్టపరిహారం

నౌకా * ఫయుడిలిటీ గ్యారంటి * మొదలైన భీమాలకు

మాతో సంప్రదించండి :

## యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్ జనరల్ ఇన్సురెన్సు కంపెనీ లిమిటెడ్,

"యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్సు"

ఎస్ప్లనేడ్ - మద్రాసు.

Telephone : 4241. Telegrams : "UNIGEN"

బ్రాంచీలు :

విజయవాడ - బెంగుళూరు - బొంబాయి - కలకత్తా

న్యూఢిల్లీ - పాట్నా - హుబ్లి - కొలంబో - సింగపూరు.

అన్నీ యేమైనాయి? త నెందుకోసం బ్రతుకుతోంది? తనకే అర్థంకాదు. ఆలోచిస్తూనే జానకి, అలా నిద్దరోయింది....

కలత నిద్దట్లో వీధితలుపు కొట్టినచప్పుడు విని జానకి లేచింది. గడియారంవంక చూసింది, చిన్నముల్లు నాలుగుమీద ఉంది. వీధిలో రిక్షాబళ్ళ మువ్వల చప్పుడు వినిపిస్తోంది. ప్రక్కనేవున్న హోటల్లో ప్లేట్లు చప్పుడవుతున్నాయి. వాకిళ్లు తుడిచే చీపుళ్ల చప్పుడు కూడా వినిపిస్తోంది. జానకి గట్టిగా ఆవులించి, బద్ధకంగా ఒకసారి ఒళ్లు విరుచుకుని, లేచివచ్చి, వీధితలుపు తీసింది. మూర్తి, లోపలికి వస్తూనే ఇవ్వాళ బండి, మూడుగంటల లేటు. వెధవ ట్రెయిన్. ఎంతకీ వచ్చిందికాదు. అన్నాడు. భర్త చేతిలోని సంచీ అందుకుని, నేనూ అదే అనుకున్నాను. ఒంటిగంటదాకా మేలుకొనే వున్నాను. ఎప్పుడొచ్చి మీరు తలుపు తడతారో అని, అంది - బండివాడు పెట్టే, బెడ్డింగూ, లోపల పెట్టి వెళ్లిపోయాడు.

“చాచిగా జోలా తీసుకురా! నిద్దరోతున్నాడా? అన్నాడు మూర్తి కోటు జేబులోంచి బిస్కట్లపొట్లాం తీస్తూ. నిద్దరోయాడు. ఇప్పుడు లేపను - మళ్లీ నా పనులుకి అడ్డం వస్తాడు. మీరు కోటు విప్పండి. ముందు స్నానం చేద్దురుగాని అంటూ లోపలికి వెళ్ళింది జానకి...మూర్తి సిగరెట్ కాల్చుకుంటూ, వాలుకుర్చీలో పండుకున్నాడు....సిగరెట్ మీద సిగరెట్ చొప్పున నాలుగు సిగరెట్లు కాల్చేసరికి - గడియారం అయిదుకొట్టింది...నీళ్లుకాగేయి రండీ! అన్న జానకి కేకవిని మూర్తి లేచాడు - ఒళ్లంతా నూనిరాసి, బిందెడు వేడినీళ్లూ స్నానం చేయించింది భర్తకి జానకి. వీపురుద్ది, ఇంక నాలుగుచెంబులు పోసుకుని తుడిచేసుకోండి. కాఫీనీళ్లు పడేయ్యాలి. అంటూ వెళ్లిపోయింది వంటింట్లోకి.

మూర్తి తల తుడుచుకుంటూ హాల్లోకొచ్చాడు. తల దువ్వుకొని, బట్టలు వేసుకునేసరికి తెల్లారయింది. ఇంతట్లోనే పిల్లలంతా లేచారు. నాన్నా, నాన్నా అంటూ ఎగబడ్డారు. పెట్టితీసి, పెద్దబ్బాయికి, ఇదిగోరా, ఇది నీకు. అంటూ, ఒక చొక్కా, ఒక నిక్కరూ, ఒక జోళ్లజతా ఇచ్చాడు.

అమ్మోయ్! నాన్న నాకు చొక్కా, పంట్లాం తెచ్చారే! అంటూ పరుగెత్తాడు పెద్దాడురామూ - ఊ - ఊ - నాన్నా నాకో, అంటూ కమల మారాం చేసింది. ఇదిగోనమ్మా! ఇది నీకు, అంటూ, ఒక సిల్కు పరికిణీ, గౌనూ, ఒక బొమ్మా తీసిచ్చాడు మూర్తి కమలకి.

అమ్మా! నాకోయ్! బొమ్మ. నాన్న బొమ్మ తెచ్చారోయ్. గౌను కుట్టించారోయ్! అంటూ, వంటింట్లోకి పరుగెత్తింది కమల. చిన్నపిల్లలు, రాధా, రఘూ, ఇద్దరికీ చెరో బిస్కట్ పొట్లాం యిచ్చి ఒళ్ళో రాధనీ, భుజాలమీద రఘూనీ, కూర్చోపెట్టుకున్నాడు మూర్తి...ఇంతలోనే కాఫీ, పట్టుకుని జానకివచ్చింది, వస్తూనే ఏమండోయ్! ఈసారి క్యాంపు ఏదో క్రొత్తగా వుందే! ఏమయినా, కాస్త కలిసొచ్చిందా? నిక్కర్లూ, షర్టులూ, గౌన్లూ, బట్టల దుకాణం, పట్టుకొచ్చారు? అంది. చిరునవ్వుతో!

మరి ఇదంతా ఎవరికోసమే? ఈ ఉద్యోగం, ఈ తాపత్రయం, ఈ క్యాంపులూ, ఇవన్నీ యెందుకు? అన్నాడుమూర్తి.

కాఫీ త్రాగడం పూర్తయింది - మూర్తి పెట్టితీసి ఇదిగో ఇది నీకోసం, నలభైరూపాయలు ఈ చీర, అంటూ, ఒక కాగితం పొట్లం, ఆమె చేతిలో పెట్టాడు- జానకి పొట్లం విప్పి, అబ్బ! ఇంత ఖరీదు పెట్టి కొనకపోతే నేమండీ! అంది.

నీ ఆనందంకోసమే ఖరీదానా! వెధవ రూపాయలు! రూపాయలు పెట్లోవుంటే కడుపు నిండుతుందిటే? అన్నాడు.

మరి నేను వంట ప్రయత్నం చెయ్యాలి. అప్పుడే ఏడయింది. మీరు వీధిలోకి వెళ్తే పెందరాళే రండి పదయ్యే సరికల్లా. ఒరే! రామూ, నువ్వూ కమలా, పుస్తకాలు పట్టుకుని, బళ్ళోకెళ్లండి...మీరిద్దరూ, హాల్లో ఆడుకోండమ్మా! ఏం? అంటూ, జానకి వంటింట్లోకి నడిచింది......

మధ్యాహ్నం పన్నెండయింది... మూర్తిభోంచేసి హాయిగా పడుకున్నాడు. పెద్దకుర్రాడూ, కుర్రదీ, కూడా, పడుకున్నారు. చిన్నపిల్లల్నిద్దర్నీ, ప్రక్కన కూర్చోబెట్టుకుని జానకి, భోజనానికి కూర్చుంది రాధ, వీపుమీద గుర్రం ఎక్కి కూర్చుంది. రఘు ప్రక్కనే కూర్చుని మజ్జిగా అన్నం తల్లి విస్తట్లో కలియబడి తినసాగాడు......

మధ్యాహ్నం మూడయేసరికి, జానకికి వంటింటిపని తెమిలింది. చిన్నపిల్లలిద్దరూ నిద్దరోయారు - భర్త పడుకుని లేచేసరికి కాస్త ఏదైనా ఫలహారం చెయ్యాలని, పొయ్యి అంటించింది మళ్లీ జానకి - పకోడీలు - కాఫీ...భర్త ఫలహారం సేవించి, వీధిలోకి వెళ్లేసరికి అయిదయింది...

అదే పొయ్యిమీద మళ్లీ ఎసురు - దొండకాయ ముక్కలువేయించి, చారు పెట్టి, క్లుప్తంగా వంట పూర్తిచేసింది. భర్త అన్నం తిని పడకగదిలోకి వెళ్లేసరికి, రాత్రి తొమ్మిది గంటలయింది. తను నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, వంటిల్లు సర్ది, పిల్లల్ని పడుకోబెట్టి, పడకగదిలోకి వెళ్లేసరికి, సరిగ్గా పన్నెండయింది. భర్త గాఢ నిద్రలో మునిగిపోయాడు. తమలపాకులుకి సున్నం రాసి, చక్కలు చితగ్గొట్టి, మెల్లిగా భర్తను లేపింది...అబ్బ! నిద్దర పట్టేసిందే? ఇంకా తెమల్లేదా? వెధవ వంటిల్లు చక్కబెట్టు? అన్నాడు మూర్తి - ఇద్దరూ తాంబూలాలు వేసుకున్నారు. అనంతరం భర్త కౌగిట్లో “శయనేషు రంభా” అన్న సూక్తి సార్థకం చేసుకుంది...అలసటవల్ల అలాగే భర్త కౌగిట్లో వాలిపోయింది.

గోడనున్న గడియారం మూడుగంటలు కొట్టింది. అప్రయత్నంగా మూర్తికి తెలివి వచ్చి లేచాడు. ప్రక్కలో జానికి లేదు... నాలుగువైపులా చూశాడు. జానకికిటికీదగ్గర వాలుకుర్చీలో పడుకొని, చీకట్లోకి చూస్తోంది. మూర్తిగబగబా లేచివెళ్లాడు. ఆశ్చర్యంగా, ఆదేమిటిజానికీ! అలాకూర్చున్నావు. నిద్దరపట్టలేదా? అన్నాడు. జానకి చిరునవ్వుతో, ఏంనిద్ర? ఏంవిశ్రాంతి? స్తబ్ధప్రకృతిలో, ఇలా కాస్సేపుకూర్చుని శూన్యంలోకి చూస్తూంటే, ఆత్మశాంతిగా వుంది. నిద్దరపట్టలేదు - ఇలా కూర్చున్నాను. అంది... చాల్లేపిచ్చిదానా! రా! పడుకో! మూడుగంటలయింది, మళ్లీ తెల్లవారితే, ఉన్నదేగా, ఈ ఈదులాట? రాత్రియినా పూర్తిగా నువ్వువిశ్రాంతి తీసుకోపోతే, ఆరోగ్యం చెడిపోదూ? అన్నాడు.

జానకి, అసంతృప్తిగా చిన్న చిరునవ్వు నవ్వి ఏం విశ్రాంతండీ? విశ్రాంతిలేదు, ఆరోగ్యం లేదు. ఒకే యాతన! జీవితంలో గృహిణిగా భారతస్త్రీకి మిగిలే జీవితసారం ఇంతే ననుకుంటాను. ఈ సెలవుల్లో నెల్లాళ్లూ హాయిగా ఈ సంసారజీవితపు కీచులాటలకి, అతీతంగా, వుండి హాయిగా ప్రశాంతంగా మా పల్లెటూళ్లో గడుపుదాం వస్తారా? అంది.

అలాగేలే! జానకీ తప్పకుండా వెళ్దాం అన్నాడు మూర్తి...భర్త ఒళ్ళో తలపెట్టుకొని అలాగే నిద్దరోయింది అమాయికంగా జానకి, జీవితసారం! నిజం! ఇంతవరకూ యథార్థం గ్రహించలేకపోయాను అనుకున్నాడు మూర్తి మనస్సులో మూగగా....

★